

పట్టు వస్త్రాలు మాయం..?
శ్రీరామనవమికి ప్రముఖులు బహూకరించిన స్వామివారి పట్టువస్త్రాలను సిబ్బంది మాయం చేసినట్లు సమాచారం. 8లో



బడిబాటకు సన్నద్ధం..
జిల్లాలో రేపటి నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 27°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుండే ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ మైనారిటీ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ కె.లిల్లీ సుజన్ సారా తెలిపారు. గురువారం ఆమె వివరాలు వెల్లడించారు. కళాశాలలో ఉర్దూ జూనియర్ లెక్చరర్(మహిళా అభ్యర్థి), సెక్యూరిటీ గార్డు(పురుష అభ్యర్థి) దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శుక్రవారం నుంచి ఈ నెల 6వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 72079 98965 నంబరులో సంప్రదించాలని సూచించారు.

96 మంది సర్వీస్ రెగ్యులరైజేషన్..



ఉత్తర్వులు అందిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష పలువురు సిబ్బందికి రెగ్యులరైజేషన్ ఉత్తర్వుల కాపీ అందించారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం 54 మంది హెల్త్ అసిస్టెంట్లు, 23 మంది ఫార్మసిస్టులు, 19 మంది ల్యాబ్ టెక్నీషియన్లు.. మొత్తం 96 మందికి సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసింది. వీరికి గురువారం ఆర్డర్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ బాధ్యతగా, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుకృత, బాలాజీ, పర్షియానాయక్, చైతన్య, మణికంఠరెడ్డి, ఎండీ ఫయాజ్‌యుద్దీన్, మోహన్, సింగో జి, రామకృష్ణ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలపై 13న సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలపై ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌లోని డీవైసీఎల్సీ కార్యాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని సింగరేణి అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులకు డీవైసీఎల్సీ కార్యాలయం నుంచి లేఖలు పంపించినట్లు సమాచారం. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినందున ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు గత ఏడాది నవంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని డిసెంబర్‌లో కోర్టు ఆదేశించినా బొగ్గు ఉత్పత్తికి కీలకమైనందున మే వరకు గడువు ఇవ్వాలని సంస్థ కోరడంతో హైకోర్టు అంగీకరించింది. ఇప్పుడు ఆ గడువు కూడా ముగియడంతో ఎన్నికలపై చర్చించేందుకు ఈనెల 13న సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఇటీవల ముగిసిన వేసవి శిబిరాల్లో ఫుట్‌బాల్ శిక్షణకు హాజరైన బాలబాలికలకు అండర్–10, 14 విభాగాల్లో టోర్నీ ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు.

నేడు బాలికల ఎంపిక పోటీలు

ఈ నెల 4 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ బాలికల జట్టు ఎంపికకు శుక్రవారం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆదర్శ్‌కుమార్ తెలిపారు. వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వేడుకలకు వేళాయె..

పదేళ్ల స్వరాష్ట్ర పండుగకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ కాంతులతో వెలుగులీనుతున్న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐడీఓసీతోపాటు విద్యుత్ తదితర శాఖల కార్యాలయాలు, కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం శోభాయమానంగా మారాయి. తెలంగాణ తల్లి విగ్రహ ప్రాంతం, బస్టాండ్, సూపర్‌బజార్ ఏరియా, పోస్టాఫీసు తదితర కూడళ్లలో విద్యుత్ వెలుగులు మిరిమిట్లు గొల్పుతున్నాయి. సింగరేణి, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి పారిశ్రామిక సంస్థలు వేడుకలకు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం వేడుకలకు సర్వం సిద్ధం చేయగా, గురువారం రాత్రి ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్ పరిశీలించారు. ఉదయం 8.30 గంటలకు కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ప్రజాప్రతినిధులు అమరవీరులకు నివాళులర్పిస్తారు. అనంతరం 9 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అతిథులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై సందేశమివ్వనున్నారు. చివరిగా సాంస్కృతిక కార్యక్రమాలు జరపనున్నారు.

–కొత్తగూడెంఅర్బన్

రైతు వేదికలను ముస్తాబు చేయాలి



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

కొత్తగూడెంఅర్బన్: ప్రతీ రైతు వేదికను మామిడి తోరణాలు, లైట్లు, పూలతో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ముస్తాబు చేయాలని కలెక్టర్ అనుదీప్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నుంచి రాష్ట్ర అవతరణ వేడుకలు, 3న తెలంగాణ రైతు దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం అన్ని శాఖల జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను సన్మానించేందుకు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాల విశిష్టతపై లబ్ధిపొందిన రైతుల కుటుంబ సభ్యుల సందేశాలను సభలో వివరించాలని సూచించారు. జిల్లాలోని 67 క్లస్టర్ల రైతు వేదికల్లో వేడుకలు జరుగుతాయని, ప్రతి వేదికలో వెయ్యి మందికి తక్కువ కాకుండా రైతులు హాజరయ్యేలా చూడాలన్నారు. తాగునీరు, సామూహిక భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 8న జరుగనున్న ఊరూరా చెరువుల పండుగ ఏర్పాట్లపై ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కట్టమైసమ్మకు, చెరువు నీటికి పూజలు చేయాలన్నారు. మహిళలు బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. 4న సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని అన్నారు. 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి గురువారం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అశోకచక్రవర్తి, ఏఓ గన్యా, సురేష్, శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, అనంత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తిప్పి పంపుతున్నారు..

- కొనుగోళ్లలో కొర్రీలతో అన్నదాతల ఆవేదన
- తక్షణమే కొనడంతోపాటు దిగుమతి చేసుకోవాలని రాస్తారోకో



మొండికుంటలో రాస్తారోకో చేస్తున్న రైతులు, అఖిలపక్ష నాయకులు

అశ్వాపురం: ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు రోడ్డెక్కారు. మిల్లులకు వెళ్లిన ధాన్యం తిప్పి పంపకుండా దిగుమతి చేసుకోవాలని ఆందోళనకు దిగారు. గురువారం మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో కొత్తగూడెం–మణుగూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అఖిలపక్షపార్టీల నాయకులు, ఎంపీపీ ముత్తినేని సుజాత, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. గంటపాటు రైతులు రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు, రైతులు మాట్లాడుతూ గతంలో ధర్నా చేస్తే అధికారులు హామీ ఇచ్చాక ధాన్యం కొనుగోలు చేశారని, ధాన్యం తరలించేందుకు లారీలు వచ్చాయని తెలిపారు. మళ్లీ ధాన్యం కొనుగోలు చేయడం లేదని, లారీలు రావడం లేదని, వెళ్లిన లారీల్లో ధాన్యం దిగుమతి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం, నిర్దేశిత ప్రమాణాలను వ్యవసాయ శాఖ ఏఈఓలు ధ్రువీకరించాక ధాన్యం కాంటా పెట్టి మిల్లులు పంపిస్తే, పది రోజులుగా దిగుమతి చేసుకోకుండా తిప్పిపంపిస్తున్నారని వాపోయారు. ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో పది లారీలు తిరిగి వచ్చాయని తెలిపారు. క్వింటాల్‌కు ఐదు కేజీల వరకు తరుగు, కోత తీసేందుకు తాము ఒప్పుకున్న దిగుమతి చేసుకోవడం లేదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించారని, కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మొండికుంట కొనుగోలు కేంద్రంలో ఇంకా భారీగా ధాన్యం నిల్వ ఉందని, మొత్తం వెంటనే కొనుగోలు చేయాలని, మిల్లుల వద్ద తక్షణమే దిగుమతి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సీఐ శ్రీనివాసరావు ఆందోళన వద్దకు చేరుకుని నాయకులు, రైతులతో మాట్లాడారు. అధికారుల హామీతో రైతులు ఆందోళన విరమించారు. కాగా పలువురు రోగులను ఆస్పత్రులకు తీసుకెళ్తుండగా ట్రాఫిక్ అంతరాయం కలిగి ఇబ్బందులు పడ్డారు. ఈ ధర్నాలో జిల్లా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, అఖిలపక్షపార్టీల నాయకులు స్వర్గం బాలనర్సయ్య, కమటం వెంకటేశ్వరరావు, ముస్కు శ్రీనివాసరెడ్డి, పగడాల కరుణాకర్‌రెడ్డి, కొండబత్తుల ఉపేందర్, సుధాకర్‌రెడ్డి, ఆవుల రవి, కోడి వెంకన్న, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆందోళనలో పాల్గొన్న 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: 2023–24 విద్యా సంవత్సరంలో గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పోట్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 రుసుంతో ఈ నెల 15వ తేదీలోగా గిరిజన గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘మన బడి’ పరిశీలన



బూర్గంపాడు: అంజనాపురం పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలం/బూర్గంపాడు: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లోని పలు పాఠశాలల్లో చేపట్టిన పనులను గురువారం జిల్లా సెక్టోరియల్ అధికారి నాగరాజశేఖర్, సైదులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం నాటికి డ్రింకింగ్ వాటర్, పెయింటింగ్, డెస్క్ బెంచీలు, టాయిలెట్స్‌లు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పూర్తైన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం దర్జీలను కలిసి నాణ్యంగా కుట్టాలని, ఈ నెల 12నాటికి కుట్టు పనులు పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, కె.పాపయ్య, సీఆర్‌పీలు గోపి కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాం
- సీతారామ, భక్తరామదాసుతో పుష్కలంగా సాగునీరు
- ఈ విద్యాసంవత్సరం నుంచే ఖమ్మం మెడికల్ కళాశాల
- విమర్శలను పట్టించుకోను.. ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష

‘సాక్షి’ ఇంటర్వ్యూలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాది అభివృద్ధి మంత్రం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ‘తెలంగాణ ఏర్పడిన తొమ్మిదేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. సీతారామ ప్రాజెక్టు, పామాయిల్ ఫ్యాక్టరీ, భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి.’ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం నుంచి మొదలుకానున్న నేపథ్యాన మంత్రి ‘సాక్షి’కి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

‘మెడికల్’ కల సాకారమైంది..

జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం ఆనందంగా ఉంది. వంద ఎంబీబీఎస్ సీట్లు మంజూరు కాగా, నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.166 కోట్లు కేటాయించింది. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని మొత్తం 30.23 ఎకరాలు మెడికల్ కళాశాలకు బదలాయించింది. జిల్లా ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఖమ్మంలో తరగతులు మొదలుకానుండడంతో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక కొత్తగూడెంలో మెడికల్ కళాశాల తరగతులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

ఆధునిక హంగులతో..

ఎన్నెస్పీ క్యాంపులోని ఏడెకరాల్లో నూతనంగా బస్టాండ్ నిర్మించుకున్నాం. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండేలా పాత బస్టాండ్‌ను పల్లెవెలుగు బస్సుల కోసం వినియోగిస్తున్నాం. ఇక అన్ని హంగులతో కార్పొరేషన్‌కు రూ.22కోట్లతో నూతన కార్యాలయాన్ని నిర్మించాం. ఖమ్మం–వైరా ప్రధాన రహదారి పక్కన వీవీ పాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్ ఖమ్మంకే తలమానికంగా నిలుస్తోంది. అలాగే కొత్తగూడెంలోని పాల్వంచ రోడ్డులో నూతన కలెక్టరేట్ నిర్మించగా అన్ని శాఖలు అక్కడే కొలువుదీరడంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటోంది.

ఐటీ హబ్‌తో ఉద్యోగావకాశాలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం జిల్లా యువత హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా నగరంలోనే ఐటీ హబ్ నిర్మించుకున్నాం. రూ.25కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ హబ్‌లో పలు కార్యకలాపాలు సాగిస్తుండగా 350 మంది యువతకు ఉపాధి లభించింది. రెండో దశ ఐటీ హబ్ కూడా మంజూరైంది.

ప్రాజెక్టులతో సస్యశ్యామలం

నీటి పారుదల ప్రాజెక్టులతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలమవుతోంది. భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు నియోజకవర్గంలోని 27 గ్రామాల పరిధిలో 60వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2016 ఫిబ్రవరిలో సీఎం కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా.. 2017 జనవరిలో ప్రారంభించుకున్నాం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని దాదాపు 9.36 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించాం. సీఎం కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు నీటి ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంట, తిరుమలాయపాలెం మండలంలో టన్నెల్ పనులు జరుగుతున్నాయి.

సంక్షేమం.. సంతృప్తికరం

ఉమ్మడి జిల్లాలో అభివృద్ధితోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్న తృప్తి ఉంది. దళితబంధు కింద రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చింతకాని మండలంలో 3,461 మందికి రూ.346కోట్ల విలువైన యూనిట్లు అందాయి. అలాగే జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ జరుగుతోంది. ఖమ్మం నగరం, కొత్తగూడెంలో సెంట్రల్ లైటింగ్, పార్కులు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అద్భుతమైన రోడ్లు నిర్మించుకున్నాం. కాలనీల్లో సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ఉమ్మడి జిల్లాలో చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తుంది.. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా కృషి చేస్తాం.

గోళ్లపాడుకు కొత్త కళ

గతంలో మురుగునీటితో ఉన్న ఖమ్మంలోని గోళ్లపాడు చానల్ నేడు అద్భుతంగా మార్చుకున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.70 కోట్లు కేటాయించగా సుమారు 10.60 కి.మీ. మేర కాల్వను పూర్తిగా ఆధునికీకరిస్తున్నాం. వర్షపునీరు, మురుగునీరు వెళ్లేలా వేర్వేరుగా కాల్వలు నిర్మించడంతో పాటు చానల్‌కు ఇరువైపులా ఉన్న 812 కుటుంబాలకు వెలుగుమట్ల వద్ద ఇళ్ల స్థలాలను కేటాయించాం. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాం. తాగునీటి పైప్‌లైన్ కూడా ఏర్పాటు చేశాం. అలాగే లకారం ట్యాంక్‌బండ్ ఖమ్మం వాసులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. కేబుల్ బ్రిడ్జి, రోప్ సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, మ్యూజికల్ ఫౌంటెన్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్టులు అందుబాటులోకి వచ్చాయి.

దశాబ్ది నిర్లక్ష్యంలో దశరథ రాముడు..

- పదేళ్ల స్వరాష్ట్రంలో పైసా ఇవ్వని ప్రభుత్వం
- రామాలయ మాస్టర్ ప్లాన్ దస్త్రాలకే పరిమితం
- ఊసేలేని శ్రీసీతారామచంద్రస్వామి పాలకవర్గం
- ప్రతిపాదనలు దాటని భద్రాచలం అభివృద్ధి పనులు



భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయం

భద్రాచలం: స్వరాష్ట్రం సిద్ధించి దశాబ్దం గడిచినా శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయ అభివృద్ధి అడుగు ముందుకు పడలేదు. మాస్టర్ ప్లాన్ రూపొందించినా ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్లు మంజూరు చేయకపోవడం, ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోవడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.

తెలంగాణ మార్క్‌లేని దేవస్థానం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత భద్రగిరి అభివృద్ధి చెందుతుందని పలువురు ఉద్యమకారులు, భక్తులు భావించారు. 2014లో తొలిసారి శ్రీరామనవమికి వచ్చిన కేసీఆర్ ఆలయానికి రూ.100 కోట్లు ప్రకటించడంతో పరమానందభరితులయ్యారు. రాష్ట్రంలో యాదాద్రిని వందల కోట్లతో పునఃనిర్మించడంతో పాటు ఇటీవల కొండగట్టు అంజన్న స్వామికి రూ.100 కోట్లను ప్రకటించారు. కానీ భద్రాచలానికి ప్రకటించిన రూ.100 కోట్లు ఇవ్వనేలేదు. మాస్టర్ ప్లాన్ కూడా డిజైన్‌కే పరిమితమైంది. దీంతో భక్తులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కనీసం పాలకవర్గం కూడా ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 13 పాలకమండళ్లు పనిచేశాయి. దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు పాటుపడ్డాయి. చివరిగా కురిచేటి పాండురంగారావు అధ్యక్షుడిగా ఉన్న పాలకవర్గం 2010 నవంబర్ 26 నుంచి 2012 నవంబర్ 25 వరకు కొనసాగింది. కాగా తెలంగాణ వచ్చాక పలువురు ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు పాలకవర్గంలో తమకు పదవులు దక్కుతాయని పెట్టుకున్న ఆశలు అడియాసలుగానే మారాయి. దీంతో ‘తెలంగాణ మార్క్’లేని దేవస్థానంగా భద్రాచలం మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొలువైన సమస్యలెన్నో..

- స్వామి వారు తిరువీధి ప్రదక్షిణల కోసం చేపట్టిన మాడ వీధుల విస్తరణపై ఆ ప్రాంత ఇళ్ల యజమానులు కోర్టుకు వెళ్లారు. వారితో చర్చించి సమస్య పరిష్కరించాల్సి ఉంది.
- భక్తులకు నిత్యాన్నదానం పరిమిత సంఖ్యలో, పరిమిత సమయంలో అందిస్తున్నారు. భవనం విస్తరించి ఉదయం, సాయంత్రం వేళల్లో అన్నదానం అందించాలని పలువురు కోరుతున్నారు.
- ప్రధాన ఉత్సవాలైన ముక్కోటి, శ్రీరామనవమి వేడుకలకు ప్రభుత్వం నేరుగా రూ.2 కోట్లు మంజూరు చేయాలి.
- శ్రీసీతారాముల కల్యాణాన్ని లక్ష మంది భక్తులు వీక్షించేలా మిథిలా స్టేడియాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయాలి.
- అనుబంధ ఆలయాలు శ్రీ ఉమాసహిత రామలింగేశ్వర, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, పర్ణశాల రామాలయాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి.
- క్రమంగా భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సత్రాలు, కాటేజీలు, వసతి గదులు, డార్మెటరీ హాళ్లు ఏర్పాటు చేయాలి. సామాన్య, మధ్య తరగతి వర్గాల భక్తులకు అందుబాటులోకి తేవాలి.

నాడు రాముడి కోసమూ పోరాటం..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమ సమయంలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతారనే ప్రచారం జరిగింది. రామాలయాన్ని నిర్మించిన కంచర్ల గోపన్న జన్మస్థలం, తహసీల్దార్‌గా పనిచేసిన స్థలం తెలంగాణ ప్రాంతం కావడం, నైజాం కాలం నుంచి శ్రీరామనవమికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ వంటి చారిత్రక సంఘటనలతోపాటు భద్రాచల రామయ్యకు తెలంగాణతో విడదీయలేని బంధం ఉందని ఇక్కడి పౌరులు, భక్తులు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే దశరథ రాముడు కొలువైవున్న భద్రాచలాన్ని తెలంగాణలోనే కొనసాగించాలంటూ ఉద్యమం చేపట్టారు. దీంతో ఇంటెలిజెన్స్ వర్గాలు అందించిన సమాచారంతో ఇక్కడి ప్రజల మనోభావాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రామాలయాన్ని తెలంగాణలోనే కొనసాగిస్తూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసింది.

- ప్రసాద్ పథకంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శంకుస్థాపన చేసిన పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

క్లుప్తంగా

పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై కేసు

అశ్వారావుపేటరూరల్: పెళ్లికి నిరాకరించిన ప్రియుడిపై ఓ ప్రియురాలు చేసిన ఫిర్యాదుపై గురువారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక ఎస్సై బీ.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడెం గ్రామానికి చెందిన తోట ముక్తేశ్వరరావు, అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని గత నాలుగేళ్లుగా ప్రేమ పేరుతో వెంటపడి, పెళ్లి చేసుకుంటానని ఆమెను వలలో పసేశాడు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం యువతి పెళ్లి చేసుకుందామని అడగ్గా, మాయ మాటలు చెప్పి కాలం వెల్లదీశాడు. దీంతో బాధిత యువతి గ్రామ పెద్దలు, పోలీసులను ఆశ్రయించగా..పెళ్లికి ఏడాది గడువు కావాలని వారిరువురు రాజీ పడ్డాడు. గడువు ముగిసినప్పటికీ పెళ్లి చేసుకోకుండా ముక్తేశ్వరరావు మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోవడంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భౌతిక దాడిపై..

దమ్మపేట: ఓ వివాహితను దుర్భాషలాడుతూ.. ఆమెపై భౌతిక దాడికి పాల్పడిన బంధువులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన జంగం స్వప్న(29) అనే వివాహిత గత నెల 17వ తేదీన శుభకార్య నిమిత్తం మండలంలోని వెంకటాద్రిగూడెంలో గల తన తండ్రి ఇంటికి పిల్లలతో కలిసి వచ్చింది. ఈక్రమంలో 20వ తేదీన ఆమె చిన్నాన సిరసాని వెంకట్రావు, చిన్న మేనత్త రాణి, ఇక్కడకు ఎందుకు వచ్చావంటూ ఆమెను అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు భౌతిక దాడికి పాల్పడ్డారు. దీంతో స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఓ కాంప్లెక్స్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న దుకాణాదారిపై అదే కాంప్లెక్స్‌కు చెందిన మరో దుకాణాదారుడు దాడి చేసిన ఘటనపై గురువారం స్థానిక టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మల్లిఖార్జున్‌రావు, ముత్యాల రాజేశ్వరి అనే ఇద్దరు వ్యాపారులు బొర్రా రామలక్ష్మమ్మ అనే కాంప్లెక్స్‌లో వేర్వేరుగా దుకాణాలను నడుపుతున్నారు. ఈక్రమంలో గురువారం ముత్యాల రాజేశ్వరి, ఆమె కొడుకు శివప్రసాద్‌లు ఇద్దరు కలిసి మల్లిఖర్జున్‌ను నీ దుకాణాన్ని అక్కడ నుంచి తీయకపోతే తర్వాత జరిగే పరిణామాలకు మాకు సంబంధం లేదని బెదిరించడంతో పాటు ఒక్కసారిగా వారిరువురు మల్లిఖార్జున్‌పై చేయి చేసుకున్నారు. ఈ విషయమై మల్లిఖార్జున్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

పరస్పర భౌతిక దాడులు..

దమ్మపేట : భూవివాదం కారణంగా రెండు కుటుంబాలు పరస్పర దాడులకు పాల్పడిన సంఘటన గురువారం మండల పరిధిలోని వెంకటాద్రిగూడెంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాద్రిగూడెంలో 40 సెంట్లు భూమి, తమదేనంటూ వరుసకు బంధువులైన చెన్ను వీరయ్య, తుమ్మ రాజు కుటుంబాలు ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడగా తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ దాడుల్లో తుమ్మ రాజుతో పాటుగా ఆయన వర్గీయులు నాగబాబు, పద్మ, లింగేశ్వరీ, మల్లేశ్వరీ తదితరులకు తీవ్ర గాయాలు కాగా చెన్ను వీరయ్య వర్గీయులకు కూడా గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

‘బడిబాట’కు సన్నద్ధం..!

విడుదలైన ‘జయశంకర్ బడిబాట’ షెడ్యూల్..

- రేపటి నుంచి 17 వరకు కార్యక్రమాలు
- బడి ఈడు పిల్లలను చేర్పించడమే లక్ష్యం
- బాల కార్మికులచే బలపాలు పట్టించేందుకు పటిష్ట చర్యలు



కొత్తగూడెం పట్టణంలో బడిబాట ర్యాలీ(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రతి ఏటా విద్యా సంవత్సర ప్రారంభానికి ముందు ‘జయశంకర్ బడి బాట’అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి కూడా బడిబాట నిర్వహించేందుకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు షెడ్యూల్ విడుదల చేశారు.

షెడ్యూల్ నిర్వహణకు ప్రణాళికలు..

షెడ్యూల్ ప్రకారం జిల్లాలో కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికోసం గత నెల 31 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు బడిబాట కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మొదటి రోజు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక ప్రజాప్రతినిధులతో, 1వ తేదీన సర్పంచ్ అధ్యక్షతన గ్రామస్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి బాడిబాట లక్ష్యాలు, ప్రణాళికలను సిద్ధం చేశారు. బాడిబాట లక్ష్యాలను సాధించడానికి ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక సేవా సంస్థలు కలిసి విజయవంతం చేయడానికి డీఈఓ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, మండల విద్యాధికారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, మహిళా, శిశు సంక్షేమ పర్యవేక్షకులు, కస్టమ్ రీసోర్స్ పర్సన్లతో ఒక కమిటీని ఏర్పాటు చేసి నివాస ప్రాంతాల్లో బాల కార్మికులు లేకుండా చర్యలు తీసుకోనున్నారు.

పకడ్బందీగా కార్యాచరణ..



జిల్లాలో బడిబాట కార్యక్రమాలు రేపటి నుంచి 17వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. షెడ్యూల్ ప్రకారం ప్రతీ పాఠశాల ఆధ్వర్యాన కార్యక్రమాలన్నీ నిర్వహిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– ఇ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రధాన లక్ష్యాలు..

- అంగన్‌వాడీలలో చదువు పూర్తి చేసిన పిల్లలు, ప్రాథమిక పాఠశాల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్తే పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చేరకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం.
- సర్కారు బడుల్లో అమలవుతున్న పథకాలు, సదుపాయాలు, బోధన తదితర విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు కార్యక్రమాలు చేపట్టడం.
- బాల కార్మికులు, చదువు మధ్యలో ఆపేసిన వారిని మళ్లీ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవడం.

షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్న కార్యక్రమాలు..

జూన్ 3 నుంచి 9వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాలిలా..

- పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతి రోజు బ్యానర్లతో ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం.
- మన ఊరు–మన బడి కార్యక్రమంలో ప్రభుత్వం అందించే సౌకర్యాలు, పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం, ఎఫ్ఎల్ఎన్ మొదలైన వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడం.
- జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని అర్హులైన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడం.
- మహిళా స్వయం సహాయక బృందాల సహాయంతో పాఠశాల వయస్సు, బడి బయట ఉన్న పిల్లలు, ఎక్కువ కాలం గైర్హాజరైన వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం.
- ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలు, భవిత కేంద్రాలో చేర్పించడం.
- బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం.
- పరివర్తన పిల్లల వివరాలను సమీపంలోని పాఠశాలల వారికి సమాచారం అందించడం.
- ప్రజాప్రతినిధుల, తల్లిదండ్రుల భాగస్వాములుగా చేసి కార్యక్రమాలు నిర్వహించడం, పాఠశాల విద్య పట్ల ఆసక్తిని కలిగించడానికి సంసిద్ధులు చేయడం వంటి పనులు చేయనున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం తర్వాత..

- 12వ తేదీ నుంచి మన ఊరు–మన బడి కార్యక్రమాల ప్రత్యేకతను పాఠశాలల్లో వివరించే కార్యక్రమాలు చేపట్టడం.
- 13న తొలి మెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపర్చడం.
- 14న సామూహిక అక్షరభ్యాసం.
- 15న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నమోదు.
- 16న పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంపై అవగాహన కార్యక్రమాలు.
- 17న బడిబాట చివరి రోజు పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం.

‘బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది’



మాట్లాడుతున్న నిర్మల్ కుమార్‌సింగ్

చుంచుపల్లి: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనతో బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని జమ్మూ కశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం నిర్మల్ కుమార్‌సింగ్ అన్నారు. గురువారం కొత్తగూడెంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని చెప్పారు.తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అందుకు పార్టీ శ్రేణులు తీవ్రంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, మాజీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వర గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోనేరు నాగేశ్వరావుతో పాటు లక్ష్మణ్ అగర్వాల్, టి.నరేంద్రబాబు, శ్రీనివాస్‌రెడ్డి, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణతో ముగిసిన వివాదం



ఆందోళన నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్లు

ఇల్లెందు: మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ్ల రాధాకృష్ణ మీద మాజీ కౌన్సిలర్ యలమందల వాసు దౌర్జన్యం చేసిన సంఘటనపై శానిటరీ వర్కర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కు మద్దతుగా గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈనేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ అంకుషావలీ జోక్యం చేసుకుని కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వాసులతో చర్చించారు. అనంతరం కార్మికులు, మున్సిపల్ అధికారుల సమక్షంలో రాధాకృష్ణకు యలమందల వాసు క్షమాపణలు తెలిపారు. ఆ తర్వాత మున్సిపల్ వర్కర్లు ఆందోళన విరమించినప్పటికీ విధులకు మాత్రం హాజరు కాలేదు.

ఆరా తీసిన కలెక్టర్ అనుదీప్..

ఇల్లెందు మున్సిపాలిటీలో జరిగిన వివాదం వెలుగులోకి రావడంతో కలెక్టర్ అనుదీప్ మున్సిపల్ కమిషనర్ అంకుషావలీకి ఫోన్ చేసి ఆరా తీశారు. సంఘటనకు దారి తీసిన అంశంపై క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సాధ్యంకాని ధ్రువపత్రాలు కూడా జారీ చేయాలని కోరతున్నట్లు గమనించారు.





రామాలయంలో పట్టువస్త్రాలు మాయం..?



ఖాళీ స్థలంలో ముగ్గు పోసిన దృశ్యం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సిబ్బంది మరో గోల్‌మాల్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. స్వామి వారికి శ్రీరామనవమి సందర్భంగా పలు సంస్థలు, ప్రముఖులు, భక్తులు, దేవస్థానాల తరఫున సమర్పించిన పట్టువస్త్రాలలో కొన్నింటిని సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా మాయం చేసినట్లు సమాచారం. వీటిని సమర్పించిన భక్తులు దేవస్థానానికి వచ్చి ఆరా తీయగా.. ఈ గోల్‌మాల్ బయల్పడినట్లుగా తెలుస్తోంది. దీంతో ఈఓ అంతర్గతంగా పట్టువస్త్రాల మాయంపై విచారణ చేస్తున్నట్లుగా సమాచారం. ఇదే రుజువైతే మరికొంత మంది ఉద్యోగులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

‘ప్రసాద్’ పనులకు ముగ్గు పనులు..

కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా భద్రాచలంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముగ్గు పోసే పనులను టూరిజం శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, పర్ణశాల ఆలయాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తొలివిడతగా రూ.42 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మిథిలా స్టేడియం పక్కనే ఉన్న ఖాళీ స్థలం, ఆర్అండ్‌బీకు చెందిన ఖాళీ స్థలంలో అధికారులు పలు వసతి గృహాలకు ముగ్గు పోశారు. ఇదిలా ఉండగా.. ప్రసాద్ పథకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్ విధానంలో భద్రాచలంలో ప్రారంభించిన విషయం విదితమే.

కూల్ డ్రింక్స్ వాహనం దగ్ధం..

టేకులపల్లి: దుకాణాలకు కూల్ డ్రింక్స్ సరఫరా చేసే వాహనం గురువారం జరిగిన అగ్ని ప్రమాదానికి ఆహుతైంది. స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచకు చెందిన శివ అనే వ్యక్తి రోజులాగే గురువారం కూడా తన టాటా ఏస్ ట్రాలీలో టేకులపల్లి నుంచి కూల్ డ్రింక్స్ తీసుకుని మండలంలోని బోడు గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బద్దుతండా పంచాయతీ పెద్దమ్మతల్లి గుడి వద్దకు రాగానే ఇంజన్‌లో పొగలు రావడంతో డ్రైవర్ వెంటనే వాహనాన్ని తుమ్మలచెలక స్టేజీ వద్ద నిలిపివేశాడు. కొద్ది సేపటికే భారీగా మంటలు ఎగిసిపడి వాహనంతో పాటు కూల్ డ్రింక్స్ బాటిళ్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో భారీగానే నష్టం వాటిల్లింది.

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని శాంతినగర్ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. గ్రామంలో బీటీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మంచినీటి సరఫరా పైపులు పగిలి నీటి సరఫరా నిలిచిందని, గత వారం రోజులుగా నీళ్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఈ నిరసన కార్యక్రమంలో కొండలు, రాములు, నాగులు, ముత్యాలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 11 మందికి గాయాలు

కొత్తగూడెంఅర్బన్: పిచ్చికుక్క స్వైర విహారం చేసి 11 మందిని గాయపరిచింది. కొత్తగూడెం లెనిన్‌నగర్‌లో తిరుగుతున్న ఈ కుక్క బుధవారం, గురువారాల్లో 11 మంది వృద్ధులు, పిల్లలను, మహిళలను గాయపర్చగా వారు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ విషయంపై వార్డు కౌన్సిలర్ తదితరులు కుక్కలను పట్టే వారిని పిలిపించి బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



రేపటి నుంచి సదరం క్యాంపులు

చుంచుపల్లి: ఈ నెల 3,8,16,23,30 తేదీల్లో జిల్లాలో సదరం క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు డీఆర్డీఓ మధుసూధన్‌రాజు గురువారం వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి క్యాంపులు ప్రారంభిస్తారు. దివ్యాంగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చేత ప్రాథమిక పరిశీలన చేసి వికలాంగత్వం గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్ తదితర వివరాలతో మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా నమోదు చేసుకునే వారితో పాటు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ గడువు ముగిసినవారు మాత్రమే స్లాట్ బుక్ చేసుకోవాలి. దీని కోసం రూ.35 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం క్యాంపులకు హాజరుకావాల్సిఉంటుంది. కాగా దివ్యాంగులకు మొత్తం 21 విభాగాల్లో ధ్రువప్రతాలు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం ఆరు, ఏడు విభాగాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నారు. శారీరక, దృష్టిలోపం, చెవిటి, మూగ, బుద్ధి మాంద్యం, మానసిక వైకల్యం, మల్టిబుల్ డిజేబుల్ అంశాలనే పరిశీలిస్తున్నారు. చెవికి సంబంధించి 51 శాతం వైకల్యం, మిగతా విభాగాలకు 40 శాతం వైకల్య లోపాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. శిబిరాల్లో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం పక్షం రోజులలోపే సదరం గుర్తింపు పత్రాలను జారీ చేస్తారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

బూర్గంపాడు: అనారోగ్యంతో పాటు మతి స్థిమితం సరిగా లేని ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం బూర్గంపాడులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపాడులోని గొల్లబజార్‌కు చెందిన కొప్పుల ముత్తమ్మ(75) గురువారం కుటుంబ సభ్యులందరూ పెద్దమ్మగుడి వద్ద బంధువుల వివాహానికి వెళ్లడంతో మధ్యాహ్న సమయాన బావిలో దూకింది. పెళ్లికి వెళ్లి ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ముత్తమ్మ ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈక్రమంలో సాయంత్రానికి ముత్తమ్మ మృతదేహం బావిలో తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలికి ఐదుగురు కొడుకులు, ఆరుగురు కూతుళ్లు ఉన్నారు. అందులో ఒక కొడుకు భార్య ఆత్మహత్య చేసుకోగా.. ఒక కుమార్తె భర్త మృతిచెందాడు. ప్రస్తుతం వారిరువురు ముత్తమ్మ వద్దే ఉంటున్నారు. ఇటీవల ఆమె ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె చెల్లించలేదని అంగన్‌వాడీ సెంటర్‌కు తాళం

కొత్తగూడెంటౌన్: అద్దె చెల్లించలేదని అంగన్‌వాడీ సెంటర్‌కు గది అద్దె ఇచ్చిన యజమాని తాళం వేసిన సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కూలీలైన్‌లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్–10కు కొన్ని నెలలుగా అద్దె చెల్లించడం లేదు. దీంతో యజమాని గురువారం ఉదయం తాళం వేయగా అంగన్‌వాడీ టీచర్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వారు యజమానితో మాట్లాడి.. అద్దె చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీశాడు.



క్లుప్తంగా...

2.61 కోట్ల ప్రయాణికులు.. రూ.513.41 కోట్ల ఆదాయం

మే నెలలో రికార్డుస్థాయిలో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం

సాక్షి, హైదరాబాద్: మే నెలలో ప్రయాణికుల రైళ్ల ద్వారా దక్షిణ మధ్య రైల్వే రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేసుకుంది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఒక నెలలో రూ.500 కోట్లకు మించి ఆదాయాన్ని పొందటం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సాధించిన రూ.467.82 కోట్లు ఇప్పటివరకు గరిష్టంగా ఉండగా, తదుపరి నెలలోనే దాన్ని అధిగమించటం విశేషం. గతేడాది మే నెలలో 2.11 కోట్ల మంది ప్రయాణికులను తరలించింది. ఇప్పుడు అంతకంటే 24 శాతం ఎక్కువ మందిని గమ్యం చేర్చడం గమనార్హం. సాధారణ రైళ్లు కాకుండా వేసవి రద్దీ నేపథ్యంలో నడుపుతున్న స్పెషల్ రైళ్ల ద్వారా మే నెలలో 538 ట్రిప్పులను అదనంగా తిప్పి 4.65 లక్షల మందిని తరలించింది. తద్వారా అదనంగా రూ.36.52 కోట్ల ఆదాయం సంపాదించింది .

సరుకు రవాణాలో మరో రికార్డు..

ఇక సరుకు రవాణాలో కొంతకాలంగా తన రికార్డును తనే అధిగమిస్తూ వస్తున్న దక్షిణ మధ్య రైల్వే మే నెలలో కూడా ఆ పంథాను కొనసాగించింది. అంతకుముందు నెలతో పోలిస్తే 7 శాతం వృద్ధితో మేలో 12.517 మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి రూ. 1,213.36 కోట్లు ఆర్జించింది. గతేడాది మే నెల లో రూ. 1065.15 కోట్లు నమోదు చేసింది. అ త్యుత్తమ పనితీరు కనబరిచిన సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బందికి దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందనలు తెలిపారు.

దశాబ్ది ఉత్సవాలు కాదు.. విషాదాలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్‌యాదవ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు దశాబ్ది విషాదాల గురించి ఎందుకు మాట్లాడడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలో పది పెను విషాదాలు జరిగాయని గురువారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, రూ.3,016 నిరుద్యోగ భృతి, రెండు లక్షల రుణమాఫీ తదితర అంశాల్లో రెండు పార్టీల నిర్లక్ష్యం కారణంగా తెలంగాణలో విషాదం నెలకొందని పేర్కొన్నారు.

మా కన్నీళ్లను తుడిచేదెవరు?

2003లో బీఆర్ఎస్ సభకు వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదం

- ప్రాణాలు కోల్పోయిన నలుగురు కార్యకర్తలు
- వారి అంత్యక్రియల్లో పాల్గొన్న కీలక నేతలు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, ఉద్యోగాలు ఇస్తామని భరోసా.. ఇన్నేళ్లయినా తమను పట్టించుకోవడం లేదని కుటుంబాల ఆవేదన

సాక్షి, కామారెడ్డి: అప్పుడు పల్లెలన్నీ గులాబీ జెండా పట్టి జై తెలంగాణ అంటూ నినదించాయి. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్.. ఎక్కడ సభలు పెట్టినా పుట్ల కొద్దీ జనం తరలివెళ్లేవారు. అలా 2003 జనవరి 6న హైదరాబాద్‌లో జరిగిన టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివెళ్లారు. అందులో కామారెడ్డి జిల్లా అన్నారం, రెడ్డిపేట గ్రామాల నుంచి ఓ ప్రైవేటు బస్సులో వెళ్లినవారు తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారిపై భిక్కనూరులో అర్ధరాత్రి సమయంలో బస్సు ప్రమాదానికి గురైంది. అన్నారం గ్రామానికి చెందిన కీసరి బాలమల్లు, మంగళారపు బాలరాజు, నెమిలి లక్ష్మణ్, భట్టు తండాకు చెందిన భట్టు లక్ష్మణ్ నలుగురు మృతిచెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. మృతుల అంత్యక్రియల్లో బీఆర్ఎస్ అధినేత, ప్రస్తుత సీఎం కేసీఆర్ పాల్గొని నివాళులు అర్పించారు. అప్పుడు కామారెడ్డిలో ఉద్యమానికి నాయకత్వం వహించిన కొమ్ముల తిర్మల్‌రెడ్డి ద్వారా నాలుగు కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందించారు. తెలంగాణ వచ్చాక ఈ కుటుంబాలను ఆదుకుంటామని, ఉద్యోగాలిస్తామని కేసీఆర్ ప్రకటించారు. అయితే రాష్ట్రం వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా.. తమను పట్టించుకునేవారు, తమ కన్నీళ్లు తుడిచేవారు లేరని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. ఉద్యమ సభకు వెళ్లొస్తూ ప్రమాదంలో చనిపోయిన తమ వారిని అమరుల జాబితాలో చేర్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.

పేదరికంలో కుటుంబాలు

ప్రమాదంలో చనిపోయిన నాలుగు కుటుంబాలు పేదరికంతో తీవ్ర అవస్థల మధ్య జీవనం సాగిస్తున్నాయి. భర్తను కోల్పోయిన మహిళలు.. కుటుంబాన్ని పోషించే దిక్కు లేక, పిల్లలను పెంచి పెద్ద చేయడానికి నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికీ కుటుంబాలు పేదరికంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. తమ కష్టాలు ఇప్పటికైనా తీరుతాయని, సీఎం కేసీఆర్ తమను ఆదుకుంటారన్న ఆశల్లోనే ఉన్నాయి. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న సమయంలోనైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాయి.



కూలి చేస్తేనే పూటగడిచేది..

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన కీసరి బాలమల్లుకు భార్య బాలరాజవ్వ, ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. బాలమల్లు మరణంతో కుటుంబ భారం నెత్తికెత్తుకున్న బాలరాజవ్వ.. కూలీనాలీ చేస్తూ పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లు చేసింది. కొడుకు రాజు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బాలరాజవ్వ కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. అయినా కూలీపనులకు వెళితేనే పూట గడిచే పరిస్థితి.

కిరాణా దుకాణంతో నెట్టుకొస్తూ..



రామారెడ్డి మండలం బట్టుతండాకు చెందిన భట్టు లక్ష్మణ్‌కు భార్య రుక్మిణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లక్ష్మణ్ మరణంతో రుక్మిణి చిన్న హోటల్ నడుపుతూ పిల్లలను చదివించింది. కూతురు రాణి పెళ్లి చేసింది. కుమారుడు కృష్ణ ఇంటర్ దాకా చదివి ఇంటి వద్ద తల్లికి సాయంగా ఉంటున్నాడు. మరో కుమారుడు శోభన్‌బాబు హిందీ పండిట్ కోర్సు పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యోగం, భూమి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇప్పటికైనా తమను పట్టించుకోవాలని రుక్మిణి వేడుకుంటోంది.



అష్టకష్టాల్లో..

రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన మంగళారపు బాలరాజుకు భార్య లక్ష్మి, కొడుకు ఉన్నారు. బాలరాజు చనిపోవడంతో లక్ష్మి చిన్నచిన్న పనులు చేస్తూ కొడుకును ఇంటర్ వరకు చదివించింది. కుమారుడు ఆటో నడుపుతుండగా, ఆమె హాస్టల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తెలంగాణ కోసం తపించిన తన భర్త చనిపోయాక రోడ్డున పడ్డామని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తోంది. తమ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి ఇస్తామని చెప్పారని.. ఎందరిని కలిసి వేడుకున్నా ప్రయోజనం లేదని వాపోతోంది. ఇప్పటికైనా ఉద్యోగం ఇవ్వాలని వేడుకుంటోంది.

ప్రపంచంలోనే తొలిసారిగా.. 3D టెంపుల్

▶ మొదటి పేజీ తరువాయి

చతురస్రాకార, తామరపువ్వు ఆకారాల్లోని గర్భాలయాలతోపాటు ఆలయ గోపురాలను కంప్యూటర్‌లో తొలుత 3డీలో డిజైన్ చేసి ఆపై యంత్రాల ద్వారా నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ సంస్థ అప్సుజా ఇన్‌ఫ్రాటెక్... త్రీడీ ప్రింటింగ్ నిర్మాణ సంస్థ అయిన సింప్లిఫోర్జ్ క్రియేషన్స్‌తో కలసి దీన్ని నిర్మిస్తోంది. పూర్తిగా ఆన్-సైట్ వద్దనే ముద్రించబడిన మోదక్, కమలం, ఆలయ గోపురం ఆకారపు నిర్మాణాలు తమ నిర్మాణ బృందానికి సవాళ్లుగా నిలిచాయని అప్సుజా ఇన్‌ఫ్రాటెక్ ఎండీ హరికృష్ణ జీడిపల్లి తెలిపారు. ఆలయ సూత్రాలకు అనుగుణంగా నిర్మాణ శైలి ఉండటంతోపాటు ఆర్కిటెక్చరల్‌గా వినూత్న పద్ధతుల్లో నిర్మిస్తున్న ఈ ఆలయం దేశంలోకెల్లా ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే శివాలయం, మోదక్ ఆకార గర్భాలయం పూర్తి కావడంతో కమలం, పొడవైన గోపురాలతో కూడిన రెండవ దశ పనులను మొదలుపెట్టామని చెప్పారు. ఆలయ రూపకల్పన, 3డీ ప్రింటింగ్ సాంకేతికత, ఆన్‌సైట్ నిర్మాణంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ సీఈఓ ధ్రువ్ గాంధీ పేర్కొన్నారు. 10 రోజుల వ్యవధిలో కేవలం 6 గంటల్లోనే మోదక్ ఆకార నిర్మాణాన్ని ముద్రించామన్నారు. తామరపువ్వు ఆకారంలోని నిర్మాణాన్ని అంతకన్నా తక్కువ సమయంలోనే సిద్ధం చేయాలనుకుంటున్నట్లు చెప్పారు.



ప్రధాన ఆలయంతో పాటు పక్కన మరో ఆలయం నిర్మాణంలో ఉన్న దృశ్యం

ఇప్పటికే దేశంలోనే తొలి 3డీ నమూనా వంతెన

సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఈ ఏడాది మార్చిలో ఐఐటీ హైదరాబాద్‌తో కలసి దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ నమూనా వంతెనను నిర్మించింది. ఈ వంతెనను ప్రస్తుతం నిర్మిస్తున్న ఆలయం ఆవరణలో ఉన్న తోటలో పాదచారుల వంతెనగా ఉపయోగిస్తున్నట్లు ధ్రువ్ గాంధీ తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారిగా 2022లో 3డీ ప్రింటింగ్ విధానంలో కాలిఫోర్నియాలోని టిహమా కౌంటీలో ఒక చర్చి నిర్మాణం జరిగిందన్నారు.

సూపర్‌ఫాస్ట్ రైల్వే లైన్లకు పచ్చ జెండా

ఆరు నెలల్లో సర్వే పూర్తిచేయాలని రైల్వేబోర్డు నిర్ణయం

విశాఖపట్నం–విజయవాడ–శంషాబాద్, విశాఖపట్నం –విజయవాడ–కర్నూలు మార్గాల సర్వేకు గ్రీన్ సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మరో కీలక రైల్వే ప్రాజెక్టుకు బీజం పడింది. ఇరు రాష్ట్రాల అనుసంధానతను మరింత బలోపేతం చేసేందుకు రెండు కొత్త సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం – విజయవాడ – తెలంగాణలోని శంషాబాద్ మధ్య మొదటిది, విశాఖపట్నం – విజయవాడ – కర్నూలు మార్గంలో రెండో రైల్వే లైన్ కోసం సర్వేకు రైల్వే బోర్డు అంగీకారం తెలుపుతూ.. దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాసింది. ఈ మార్గాల్లో సూపర్ ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టు చేపట్టేందుకు అవసరమైన టెక్నికల్ ఫీజిబిలిటీని ఈ సర్వే ద్వారా నిర్ణయిస్తారు. సర్వే అయిన తర్వాత ప్రాజెక్టుపై ముందడుగు పడనుంది. ఈ రెండు రైల్వే లైన్లు కలిసి 942 కిలోమీటర్ల మార్గంలో (గరిష్టంగా 220 కేఎంపీహెచ్ వేగంతో ప్రయాణించేలా) రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేను 6 నెలల్లో పూర్తిచేయనున్నారు. ఈ రైల్వే లైన్లకు సంబంధించి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పలుమార్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి లేఖలు సమర్పించారు. ఈ సూపర్‌ఫాస్ట్ రైల్వేలైన్ ద్వారా తెలుగు రాష్ట్రాలకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు తాజాగా ఈ రెండు రూట్లలో సూపర్ ఫాస్ట్ రైల్వే లైన్ల సర్వేకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది.

వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయండి

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కాంట్రాక్ట్ అధ్యాపకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను ఏవిధంగా రెగ్యులరైజ్ చేయాలనే దానిపై నివేదిక తయారు చేయాలని అధికారులను మంత్రి సబిత ఆదేశించారని అధ్యాపకులు తెలిపారు.

జిల్లా వార్తలు

భద్రాద్రిలో 'నృసింహ సేవావాహిని'నిత్యాన్నదానం



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంఅర్బన్: సుదూర ప్రాంతాల నుంచి భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల కోసం శ్రీనృసింహ సేవా వాహిని ఆధ్వర్యాన గురువారం నిత్యాన్న ప్రసాద నిలయాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఈ నిత్యాన్న ప్రసాద నిలయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, రామాలయం ఈఓ రమాదేవితో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నృసింహ సేవావాహిని చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మన్యంలో సేవలందిస్తున్న వాహిని వ్యవస్థాపకులు డాక్టర్‌కృష్ణ చైతన్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్యతో పాటు శ్రీధర్, బోగాల శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సంబరాలు సరే.. ఆకాంక్షల మాటేమిటి?

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సంబరాలు నిర్వహించడం బాగున్నా, రాష్ట్రం కోసం పోరాడిన ప్రజల ఆశలు, ఆకాంక్షల మాటేమిటని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రశ్నించారు. నిధులు, నీళ్లు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం ప్రజలు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకుంటే.. త్యాగాలు ఒకరివిగా, భోగాలు మరొకరివిగా పరిస్థితి మారిందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయలేకపోగా, ప్రశ్నపత్రాల లీకేజీతో వ్యవస్థ అవినీతియమైందని తెలిపారు. పదేళ్ల తెలంగాణలో ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పడకేసిందని, పోడు భూములకు పట్టాల పంపిణీలోనూ స్పష్టత లేదని ఆరోపించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధం కాంగ్రెస్ హయాంలో కంటే ఎక్కువగా సాగుతున్నాయని విమర్శించారు. ఈమేరకు ప్రజాపంథా ఆధ్వర్యాన శుక్రవారం తెలంగాణ ఆకాంక్షలు, ఆశల దీక్షా దినంగా జరుపనున్నట్లు రంగారావు తెలిపారు.

సింగరేణిలో 102 శాతం ఉత్పత్తి

- ఏప్రిల్‌తోపోలిస్తే ఐదు శాతం అదనం
- కొత్తగూడెం రీజియన్‌లో అత్యధికంగా బొగ్గు వెలికితీత



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్

సింగరేణి(కొత్తగూడెం): ఏప్రిల్ మాసానికి సంబంధించి నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిలో 97శాతం లక్ష్యాన్ని సింగరేణి.. మేలో 102 శాతం ఉత్పత్తి నమోదు చేసింది. ఈ నెలలో 57,81,900 టన్నుల లక్ష్యానికి గాను 58,72,118 టన్నుల ఉత్పత్తి సాధించారు. సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భ గనుల్లో 6,84,900 టన్నుల లక్ష్యానికి 4,62,287 టన్నులు(67 శాతం), 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 50,97,000 టన్నులకు 54,09,831 లక్షల టన్నులు(106 శాతం) ఉత్పత్తి నమోదైంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలల్లో 1,13,89,500 టన్నుల లక్ష్యానికి గాను 1,14,46,309 టన్నులతో వంద శాతం ఉత్పత్తి సాధ్యమైంది.

ఇల్లెందులో అత్యధికం..

సింగరేణి సంస్థ కొత్తగూడెం రీజియన్ పరిధి ఇల్లెందులో 138శాతం ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా, మణుగూరు ఏరియా 122 శాతంతో రెండో స్థానం, 114 శాతంతో కొత్తగూడెం ఏరియా మూడో స్థానంలో నిలిచాయి.

ఏప్రిల్, మేలో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు..

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి	శాతం
ఇల్లెందు	5,20,000	7,07,000	136
మణుగూరు	19,47,327	24,08,104	123
కొత్తగూడెం	20,27,000	22,90,425	113
బెల్లంపెల్లి	5,77,308	6,41,287	111
ఆర్జీ–2	14,99,554	15,16,708	101
ఆర్జీ–3	8,72,692	8,27,661	94
ఆర్జీ–1	7,64,292	6,94,441	91
మందమర్రి	7,29,558	6,28,545	87
శ్రీరాంపూర్	12,28,904	9,35,664	76
అడ్రియాల	2,85,504	1,20,724	42
భూపాలపల్లి	7,63,962	5,26,908	69
మొత్తం	1,11,67,119	1,12,49,682	100.74

వార్షిక లక్ష్యాలను అధిగమించాలి..

ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తితో పోలిస్తే మేలో మరింత పెరిగింది. అధికారులు, కార్మికులు, ఉద్యోగుల సమష్టి కృషితో ఇది సాధ్యమైంది. ఇదే స్ఫూర్తితో పనిచేస్తే వార్షిక లక్ష్యాన్ని సులువుగా అధిగమించవచ్చు. ఓపెన్‌కాస్ట్ గనులకు సంబంధించిన ఓబీ రిమూవల్ పనులు వేగం పెంచాలి. సింగరేణి వ్యాప్తంగా 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజుకు సుమారు 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీయాల్సి ఉంటుంది. ఈ విషయమై అధికారులు చొరవ తీసుకుని అంతరాయం వాటిల్లకుండా చూడాలి.

– సింగరేణి డైరెక్టర్ పా ఎస్ బలరామ్

వచ్చే నెలలో కొత్త వేతనం

- సింగరేణిలో అమల్లోకి 11వ వేజ్‌బోర్డ్ నిర్ణయాలు
- సుమారు 42 వేల మంది కార్మికులకు లబ్ధి



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సంబంధించి పదో వేజ్‌బోర్డ్ సవరణ 2021 జూన్ 30వ తేదీతో ముగియగా, 11వ వేజ్‌బోర్డ్ ఈ నెల నుంచే అమల్లోకి రానుంది. జూలైలో కార్మికులు కొత్త వేతనం అందుకోనున్నారు. సుమారు 23 నెలలపాటు జరిగిన సమావేశాల్లో కార్మికుల జీతభత్యాల అంశం కొలిక్కి వచ్చింది. ఇందులో భాగంగా ఒకటో కేటగిరీ కార్మికుడు 26 రోజులపాటు క్రమం తప్పకుండా పనిచేస్తే వస్తున్న వేతనం రూ.26,293 నుంచి ఇప్పుడు రూ.39,069కి చేరనుంది. అంటే గత వేజ్‌బోర్డ్‌లో పోలిస్తే రూ.12,776 పెరిగినట్లవుతుంది. ఈమేరకు రోజుకు రూ.496 జీతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 19శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్‌తో పాటు 25 శాతం ఇతరత్రా అలవెన్స్‌లు కలిపి ఉంటాయి. కాగా పెంచిన అలవెన్స్‌ల్లో 10వ వేజ్‌బోర్డ్‌లో ఎన్‌డీఏ రోజుకు రూ.18.15 ఉండగా, ప్రస్తుతం రూ.26.97కు పెంచారు.

సంస్థపై రూ.70 కోట్ల భారం

కోల్‌కతాలో గత నెల 18, 19వ తేదీల్లో జరిగిన 11వ వేజ్‌బోర్డ్‌లో పదో సమావేశంలో 19శాతం మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్, 25శాతం ఇతర అలవెన్స్‌లు కలిపి నూతన వేతనాలు నిర్ధారించారు. తద్వారా సంస్థపై రూ.70 కోట్ల భారం పడనుందని జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి వెల్లడించారు. సంస్థలో ఒకటో కేటగిరీ నుంచి ఆరో కేటగిరీ, సూపర్‌వైజర్లు, ఇతర ఉద్యోగులు సుమారు 42 వేల మంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈ నెల నుంచే వేతన పెంపు అమలు జరుగుతుందని, సింగరేణి ఉన్నతాధికారులు ఆమోదం తెలిపితే జూలై 3న కార్మికులు కొత్త వేతనం అందుకుంటారని జీఎం పేర్కొన్నారు.

సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బలరాం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఆవిర్భావ సంబరాలను సింగరేణిలో ఈనెల 2, 5వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నామని డైరెక్టర్ (పా) ఎస్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలోని గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 2వ తేదీ శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అనంతరం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కూడా ప్రత్యేక నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇక 5వ తేదీన ప్రకాశం స్టేడియంలో జరిగే సెంట్రల్ ఫంక్షన్‌కు ప్రజాప్రతినిధుల తో పాటు అన్ని యూనియన్ల నాయకులు, కార్మికులు, కార్మిక కుటుంబాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎన్వీ.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, అధికారులు ఏ.కుమార్‌రెడ్డి, కట్టా బసవయ్య పాల్గొన్నారు.

మతం పేరుతో ఆదివాసీలను విభజిస్తే సహించం

మాజీ ఎంపీ మిడియం బాబూరావు



సభలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

కామేపల్లి(కారేపల్లి): మతం పేరుతో ఆదివాసీలను విభజించాలని చూస్తే సహించేది లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. అలాగే, మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని అడ్డుకునేందుకు కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కామేపల్లి మండలం కొత్తలింగాలలో సంఘం జిల్లా మూడో మహాసభలకు వజ్జా రామారావు, కింద రామచంద్రయ్య, రవ్వ రమణ అధ్యక్షత వర్గంగా నిర్వహించారు. ఈ సభలో బాబూరావు మాట్లాడుతూ ఆదివాసీలను అణచివేయాలనే లక్ష్యంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టడంలో భాగంగానే మతం మారిన ఆదివాసీలపై బుల్లెట్ల వర్షం కురిపిస్తామని ఒక ప్రజాప్రతినిధి బెదిరించడం గర్హనీయమన్నారు. నాయకులు బండ్ల జోగయ్య, కారం పుల్లయ్య, వజ్జా సురేష్, గౌరీ నాగేశ్వరరావు, వజ్జా రామారావు, దుగ్గి కృష్ణ, సీతారాములు, పెంటయ్య, గంగరాజు, సర్ప వీరస్వామి, దుగ్గి పాపారాణి, నరసింహారావు, కంకటి పుల్లయ్య, కుర్సం శ్రీనివాస్, బొడ్డు సతీష్, ఎల్లబోయిన రాఘవులు పాల్గొన్నారు.

'దేశాన్ని లూటీ చేస్తున్న మోదీ ప్రభుత్వం'

ఖమ్మంమయూరిసెంటర్: అధికారం కోసం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజలను కొల్లగొట్టి, కార్పొరేటర్లకు కట్టబెడుతూ దేశాన్ని లూటీ చేస్తోందని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ విమర్శించారు. ఖమ్మంలో గురువారం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం (ఇఫ్టూ అనుబంధం) జిల్లా మూడో మహాసభలు జరగగా, నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహాసభలో జనార్దన్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను మోదీ ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేస్తోందని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని స్థితికి చేరుకున్నారని, మరోపక్క కార్మికుల కనీస హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. భవన ఇతర నిర్మాణ కార్మికులు, అన్ని రంగాల కార్మిక వర్గం మోదీ, కేసీఆర్‌లు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత ఇఫ్టూ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గంటా నాగయ్య ఎగురవేయగా.. గుగులోత్ పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, నాయకులు కోలా లక్ష్మీనారాయణ, షేక్ సుభహాన్, ఐ.వెంకన్న, బోడ నాగేశ్వరరావు, సందీప్, కొండల్, గౌని మోహన్‌రావు, కృష్ణ, భద్రమ్మ, పున్నమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో దశాబ్ది ఉత్సవాలు

భద్రాచలం: గిరిజన గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర గురుకుల సొసైటీ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ వీసీ ద్వారా పలు సూచనలు చేశారు. గురుకులాల్లో జరిగిన అభివృద్ధి, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ఉత్సవాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనేలా చూస్తూ భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. అలాగే, పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లను డేవిడ్‌రాజ్ వివరించారు.

ఐటీ హబ్ వాచ్‌మెన్ మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బుద్దారానికి చెందిన బాసిపోంగు ప్రభాకర్(44) బుధవారం మధ్యాహ్నం విధుల్లో చేరాడు. రాత్రి 9గంటల సమయాన రక్తం కక్కుతూ కింద పడిపోగా సహచర ఉద్యోగులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా, ప్రభాకర్ భార్య జయ తన భర్త మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని గురువారం ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు.